చెరకు రైతుకు దిక్కెవ్వరు?

- లక్షలాది రైతు, కార్మిక కుటుంబాలను ఆదుకునే నాధుడే కరువే...
- కార్మికులు, కర్షకులను నమ్మించి మోసంచేస్తున్న కూటమి నాయకులు
- తెరమీదకు మొక్కజొన్నతో మరో మోసం - ఏపి చెరకు రైతు సంఘం

కాసులుబాబు

రెడ్డిపల్లి అప్పలరాజు

విశాలాంధ్ర-చోడవరం: విధి విపత్కర పరిస్థితుల్లో చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో లక్షలాది చెరుకు రైతులు కార్మికుల కుటుంబాలు ఆదుకునే దిక్కు కోసం బిక్కుబిక్కు మంటూ ఎదురుచూపులు చూస్తూనే ఉన్నారు. ఎన్నికల ముందు, తరువాత గోవాడ సుగర్స్ ను ఆదుకుంటామని, పూర్వ వైభవం తీసుకొస్తామని కార్మికులను, కర్షకులను నమ్మబలికిన కూటమి నాయకులు నేటికీ మోసం చేస్తూనే ఉన్నారని ఏపీ చెరుకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు వెంకటరమణ (కాసులుబాబు), రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు లు ఆరోపించారు. ఈ మేరకు మీడియా కు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో సహకార రంగానికి రోల్ మోడల్ గా నిలిచిన గోవాడ సుగర్స్ ను శిధిల స్థితికి, వెంటిలేటరు పై చేర్చిన ఘనత అధికార తెలుగుదేశం నాయకులదే అని అన్నారు. చోడవరం, మాడుగుల నియోజక వర్గాల్లో లక్ష మందికి పైగా కర్షకులు, కార్మికులు చెరుకు పండిస్తూ, గోవాడ సుగర్స్ పైన ఆధారపడి జీవిస్తుండగా, కూటమి (టిడిపి బిజెపి జనసేన) నాయకులు మాత్రం డిస్టలరీ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, చెరుకు పంట వద్దని మొక్కజొన్న పండించ మంటూ సాధ్యాసాధ్యాలపై సర్వే చేయకుండా రైతాంగాన్ని నేటికీ నమ్మిస్తూ బకాయిలు చెల్లించ కుండా నిలువునా మోసం చేస్తున్నారని తెలియ జేశారు. గత ప్రభుత్వం 5 ఏళ్లలో రూ.89 కోట్లు నిధులు ఇచ్చి షుగర్ ఫ్యాక్టరీను ఆదుకోగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2023-24 సీజన్లో చెరుకు సప్లై చేసిన రైతులకు చెల్లించవల సిన టన్నుకు రూ.150 కూడా ఇవ్వలేదని అన్నారు. 2024-25 సీజన్లో లక్ష 7 వేల టన్నులు చెరుకు క్రషింగ్ జరపగా, దానిలో జనవరి 21 నుండి ఫిబ్రవరి 4 వరకు మాత్రమే మొదట పేమెంటు గా టన్నుకు రూ. 3 వేలు చొప్పున పేమెంట్ చేశారని తెలిపారు. ఆ తర్వాత ఏప్రిల్ 10 వరకు ఫ్యాక్టరీ క్రషింగ్ జరిపిన రైతులకు నేటికీ పేమెంట్లు ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వ సహకారం ఉంటేనే తప్ప రైతులను, కార్మికు లను ఆదుకునే పరిస్థితి లేదని, భవిష్యత్తు అంధకార మని తెలిసినా దశాదిశా ముందుకు ఎలా సాగుతుందో దిక్కు తోచని స్తితి లో, చెరుకు పంటసాగుచేయాలోవద్దో తెలియని అయోమయం లో రైతాంగం ఉన్నారన్నారు. క్రషింగ్ సీజన్ కు ముందు. ఫ్యాక్టరీ మహాజన సభలో ప్రతీ 15 రోజులకు పేమెంట్లు ఇస్తామని, ప్రభుత్వం నుండి నిధులు తీసుకొస్తామని హామీలు ఇచ్చిన ఎం.పి. సి.ఎం రమేష్, చోడవరం మాడుగుల ఎమ్మెల్యేలు జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లురవీంద్రలు చేసిన హామీలు కార్యాచరణలో శూన్యమయ్యాయని తెలిపారు. కార్మికులకు నెలలు తరబడి జీతాలు ఇవ్వకపోగా అన్ సీజన్ పేరిట ఎక్కువమంది కార్మికు లను ఇంటికే పరిమితం చేయడం తో భార్య పిల్లలతో బతకలేక, బ్రతుక బండిని ఈదలేక, అసలు ఉద్యోగం ఉందోలేదో తెలియక, అరకొర పస్తులతో, అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోవాడసుగర్సను నమ్ము కున్న కార్మికులు, కర్షకులకు బకాయిలు చెల్లించి, న్యాయం చేయాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది ఫ్యాక్టరీ చెరకు గానుగ ఆడుతున్నది లేనిది స్పష్టత నివ్వాలని ప్రభు త్వానికి, కర్మాగారం యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

23 నుంచి 25 వరకు వాడ్రాపల్లిలో

రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు

- పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

విశాలాంధ్ర-మునగపాక: ఈ నెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మూడురోజుల పాటు మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించనున్నారు.పోటీలకు సంబంధించిన పోస్టర్ను యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయకుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. వాడ్రాపల్లి గ్రామంలో శతకం పట్టు వద్ద కోయిలాడ దశావతారం సహకారంతో గౌరీ యూత్,వీరాంజనేయ యూత్ ఆధ్వర్యంలో దీపావళి, నాగులచవితి, గౌరీ పరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొయిలాడ దశావతారం,కె.నూకఅప్పారావు, యూత్ కమిటీ సభ్యులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

తెగులు సోకి

ఎండిపోతున్న వరి పంట

విశాలాంధ్ర-కే కోటపాడు: ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో మెట్ట ప్రాంతాల్లో కూడా వరి నాట్లు వేశారు. చెరకును పూర్తిగా పక్కన పెట్టి వాటి స్థానంలో వరి పంట వేయడం జరిగింది. ఈ సంవత్సరం ధాన్యం దిగుబడి అధికంగా వస్తుందని ఒకపక్క ప్రభుత్వం లెక్కలు కడుతుండగా, పంటలకు అధికంగా చీడపీడలు ఆశించి పంటలు ఎండిపోవడంతో రైతులు మరోపక్క ఆందోళన చెందుతున్నారు. ఈ మండలం సూరెడ్డిపాలెం గ్రామంలో ఈర్లే దేవుడు అనే రైతు 42 సెంట్లు స్థలంలో పెన్నా సోనా అనే వరి రకం వేశాడు. ఇప్పటివరకు 20,000 ఖర్చు చేసినా.. పంట ఎండిపోతున్నదని విలేకరులకు తెలిపారు. ఇప్పటికే అనేక రకాల పురుగు మందులు పిచికారీ చేశానని తెగులు మాత్రం తగ్గటం లేదని అన్నారు. వ్యవసాయా అధికారులు సూచనలతో వరి పండిస్తే రైతుకు అదనపు ఖర్చులు లేకుండా చూస్తారని ఒకపక్క ప్రభుత్వం చెబుతున్నా అనేక మంది రైతులు పెడచెవిన పెడుతూ ఎరువులు షాపు డీలర్ల సూచనలే పాటిస్తుంటారు. నకిలీ ఎరువులు, అనుమతి లేని పురుగుమందులు విక్రయిస్తున్నారని ఆరోపణలతో ఇటీవల విజిలెన్స్ అధికారులు అనేక షాపులను సీజ్ చేయడం జరిగింది. ఏపీ రైతు సంఘం సభ్యులు వనము సూర్యనారాయణ రొంగలి ముత్యాల నాయుడు సూరెడ్డిపాలెం గ్రామంలో ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు. తెగుళ్లు ఆశించి ఎండిపోతున్న ఈర్లే దేవుడు పంట పొలాన్ని వ్యవసాయా అధికారులు పరిశీలించి న్యాయం చేయాల్సిందిగా వారు డిమాండ్ చేశారు.

జాతీయ ,అంతర్జాతీయ సమస్యలతో

ఇస్కఫ్ కౌన్సిల్ సమావేశంలో చర్చ

విశాలాంధ్ర-అనకాపల్లి: ఈ నెల 11 12 తేదీలలో కేరళ రాష్ట్రంలోని కొల్లం ఇస్కఫ్నేషనల్ కౌన్సిల్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశాలలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి జాతీయ కౌన్సిల్ సభ్యులు పాల్గొని అంతర్జాతీయంగా , జాతీయంగా ఉన్న సమస్యలను సాంస్కృతిక అంశాలను పరిశీలించి అనేక నిర్ణయాలు చేశారు. గతంలో విశాఖపట్నంలో జరిగిన జాతీయ కౌన్సిల్ సమావేశాల నుండి ఇప్పుడు జరుగుతున్నటువంటి ఈ కౌన్సిల్ సమావేశాల మధ్యకాలంలో జరిగిన సంఘటనలు ప్రధానంగా అంతర్జాతీయంగా అమెరికన్ సామ్రాజ్యవాదుల అండతో ఇజ్రాయిల్ పాలస్తీనా పై దాడి చేసి 65 వేల మంది అమాయక ప్రజలను అందునా మహిళలను చిన్నపిల్లలను సైతం అతి క్రూరంగా చంపేసిన పరిస్థితుల్ని ఈ సమావేశాలు తీవ్రంగా ఖండించి తమ నిరసన తెలియజేశారు. ఈ సమావేశాల్లో అనకాపల్లి జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇస్కఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. ఏ. మాధవరావు మాట్లాడుతూ. ఇస్కఫ్ లో విద్యార్థులను యువకులను మహిళలను లాయర్లు డాక్టర్లు ఇంజనీర్లు ఇతర మేధావి వర్గాన్ని సమీకరించి అనేక అంశాల పైన సెమినార్లు కండక్ట్ చేయడం ద్వారా అలాగే విద్యార్థులకు పోటీలు నిర్వహించడం ద్వారా ప్రజల్లోకి తీసుకుపోయి ఇస్కఫ్ను బలపరచ వలసిన అవసరం చాలా ఉందన్నారు.ఈ సమావేశాల్లో ఏపీ ఇస్కఫ్ నుండి నేషనల్ కౌన్సిల్ మెంబర్స్ రాజశేఖర్ , సనపాలనరసింహులు , శ్రీమతి నిర్మల , సత్య ఆంజనేయ ,వసంత బాబు రమేష్ హాజరైనారు.

నేడు ఎంపీడీఓ కార్యాలయంలో పీజీఆర్ఎస్

విశాలాంధ్ర-పరవాద: పరవాడ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసిల్దార్ బి.నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని తహసిల్దార్ స్పష్టం చేశారు.

15 న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని సబ్బవరం సబ్ డివిజన్ పరిధిలోని సబ్బవరం డి1 విద్యుత్ కార్యాలయం నందు ఈనెల 15వ తేదీ బుధవారం ఉదయం 10: 30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడునని కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశమునకు గౌ. చైర్మన్ సి.జి.ఆర్.ఎఫ్ బి. సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు బి సులేఖ రాణి, ఇతర సభ్యులు ఎన్ మురళి కృష్ణ , ఎస్ సుబ్బారావు హాజరగుదురని కార్యదర్శి సి. జి. ఆర్. ఎఫ్ ఒక ప్రకటనలో తెలియజేసారు.విద్యుత్ వినియోగారులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకొని విద్యుత్ సమస్యలకు పరిష్కరించుకోవల్సినందిగా కోరారు.

మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించండి..

విశాలాంధ్ర-నాతవరం: నర్సీపట్నం నియోజకవర్గం నాతవరం మండలం గోలుగొండ పేట గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆదివారం నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ వీర సూర్యచంద్ర ను గ్రామస్తులు కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. దీనిపై స్పందించిన సూర్యచంద్ర, నర్సీ పట్నం ఆర్టీసీ డిపో మేనేజర్కు ఫోన్ చేసి విషయం తెలియపరచడం జరిగింది. అనంతరం డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు సూర్యచంద్ర చెప్పారు. జనసేన పార్టీ నాయకులు పోలివర్తి శ్రీనివాస్, మాకిరెడ్డి వెంకటరమణ, గోల్కొండ పేట గ్రామస్తులు ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



విశాలాంధ్ర-పరవాడ: అన్ని దానాల్లోకల్లా రక్తదానం మహోత్తర పుణ్యకార్యం అని జీవీఎంసీ 79 వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం 79 వ వార్డు పరిధి పాత దానబోయినపాలెం రామాలయం వద్ద ఆంధ్ర ప్రదేశ్ క్రేన్ ఓనర్స్ అండ్ ఆపరేటర్స్, టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రౌతు ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొన్నారు. ప్రతి ఏటా తమ వార్డులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరం అన్నారు. రక్తదానం చేసిన వ్యక్తులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం దాతలకు ధ్రువపత్రాలు, షీల్డ్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు కె.జగదీశ్, సింగిడి సింహాచలం అసోసియేషన్ అధ్యక్షుడు శరత్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 14.60 కోట్లతో రహదారి అభివృద్ధి

రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర-పాయకరావుపేట: పాయక రావుపేట నియోజక వర్గంలో 34.36 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధికి రూ.14.60 కోట్లు మంజూరైనట్లు రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 6.60 కోట్లతో రేవుపోలవరం - బంగారమ్మపాలెం (4.53 కి.మీ), ఉద్దండపురం - తిరుపతిపాలెం వయా నల్లిపాడు - గుల్లిపాడు - రేబాక (10.86 కి.మీ), యస్.రాయవరం - పిట్లపాలెం (1 కి.మీ), రూ.5 కోట్లతో ఈదటం- పాల్మన్ పేట, వెంకటనగరం (6.305 కి.మీ), యస్.రాయవరం -బంగారమ్మపాలెం (2 కి.మీ), తుని ఆర్ అండ్ బీ రోడ్ - పాల్మన్ పేట (2.70 కి.మీ), రూ. 3 కోట్లతో సారిపల్లిపాలెం - రాజయ్యపేట వయా సిహెచ్ ఎల్ పురం, తీనార్ల, దొండవాక రోడ్లు నిర్మించినట్లు మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.

కళాకారులకు ఆడిషన్ మల్టీ విటమిన్ టాబ్లెట్ లాంటిది

కాప్ వ్యవస్థాపకులు, హాస్యనటులు గౌతంరాజు భూపతిరాజు

విశాలాంధ్ర-అనకాపల్లి: నటులకు నాటకరంగం పునాదిరాయి వంటిదని సినిమా ఏక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (కాప్) వ్యవస్థాపకులు, ప్రముఖ సినీ హాస్య నటులు భూపతిరాజు గౌతంరాజు అన్నారు. పట్టణంలోని శ్రీ గౌరీ గ్రంథాలయం సమావేశం హాలులో ఆదివారం కాప్ సహకారంతో హాస్య కళా సమితి ఆధ్వర్యంలో జిల్లాలో మొదటిసారిగా అనకాపల్లిలో కళాకారుల ఎంపిక ఆడిషన్స్ ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కళాకారులను ఉద్దేశించి గౌతంరాజు మాట్లాడుతూ. అడిషన్స్ కళాకారులకు మల్టీ విటమిన్ టాబ్లెట్లుగా ఉపయోగపడతాయన్నారు. కళా ప్రపంచంలో అద్భుతాలు సృష్టించాలనుకునే ప్రతి యువ కళాకారుడికి అడిషన్స్ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నిరంతర సాధన, అంకితభావం, పట్టుదలతోనే గొప్ప కళాకారులు తయారవు తారన్నారు. కళాకారులకు ప్రతిభ, భవిష్యత్లకు ఆడిషన్స్ ముఖద్వారమని గౌతంరాజు పేర్కొన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి 140 మందికిపైగా కళాకారులు అడిషన్స్కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ, అంకితభావం, ప్రత్యేక శ్కెలి, సామర్థ్యం మొదలగు అంశాలను కళాకారుల్లో పరిశీలించారు. ఆడిషన్ వేదిక వద్ద ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ప్రేక్షకులు కూడా ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించారు. కార్యక్రమంలో సినీ దర్శకులు ఆర్.వి.సుబ్రహ్మణ్యం (సుబ్బు), శరగడం చిన్నికృష్ణ, హాస్య కళా సమితి అధ్యక్షులు విల్లూరి వీర సంతోష్, కార్యదర్శి బుద్ధ ప్రవీణ్కుమార్, ఎన్డీ గ్రూప్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్, శ్రీ జగన్నాథస్వామి ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ దాడి ఈశ్వరరావు, కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు గౌతమ్ రాజు భూపతి రాజు, ఆర్. వి. సుబ్రహ్మణ్యం, ఎస్ చిన్నికృష్ణ లను హాస్య కళా సమితి ఘనంగా సత్కరించింది.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన

విశాలాంధ్ర-చోడవరం: మండలంలోని అంభేరుపురం గ్రామంలో అంబేద్కర్ నూతన విగ్రహం ఏర్పాటుకు ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూతి కోటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఇక్కడి అంబేద్కర్ విగ్రహం శిధిల స్థితికి చేరుకోవడంతో, నూతన విగ్రహం ఏర్పాటుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూతి కోటేశ్వరరావు సహకరిస్తున్నారని కమిటీ వర్గాలు తెలిపారు. రెండు నెలల్లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని కోటేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏడువాక లక్ష్మణ కుమార్, సర్పంచ్ కార్లి ఈశ్వరమ్మ, నడుపూరు దేవుడు మాస్టారు, సూరిశెట్టి గోవింద, నీటి సంఘం అధ్యక్షుడు వేగి గంగేశ్వరరావు, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులుగా చదువుకుని ఉపాధ్యాయులుగా కలుసుకున్నారు

విశాలాంధ్ర-పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన శ్రీ వెంకటేశ్వర కాలేజ్ అఫ్ ఎడ్యుకేషన్ నందు 1997-98 వ సంవత్సరంలో బిఈడి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వీరిలో చాలామంది ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నందు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులుగా ఉన్నారు. ఎప్పుడూ పిల్లలకు పాఠాలు చెప్పే వీరంతా తాము చదువుకున్న కాలం నాటి సంఘటనలు నెమరు వేసుకోవడానికి ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమ్మేళనంలో అందరూ కలిసి సందడి చేశారు. 28 సంవత్సారాల తరువాత కలసిన వీరందరూ అలనాటి తీపి గుర్తులని తలచుకొని ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె నరసింహారావు మాట్లాడుతూ సమాజ హితమే ఉపాధ్యాయుల ప్రథమ లక్ష్యమని ఆకాక్షించారు. తమ దగ్గర చదువుకున్న విద్యార్థులు నేడు బాధ్యాతాయుతమైన ఉపాధ్యాయ రంగంలో ఉండి విద్యావ్యాప్తి కి కృషి చేయడం ఆనందనీయమని, మున్ముందు వారు విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

జనసేన పార్టీని బలోపేతం చేయాలి

ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర-కె కోటపాడు: గ్రామాల్లో జనసేన పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని , ఇందుకు జన సైనికులు కృషి చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే , జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు అన్నారు. కే కోటపాడు మండలం సమీపంలో ఉన్న గుడిపాల గ్రామానికి వచ్చిన పంచకర్ల కార్యకర్తలతో మాట్లాడారు. ఎక్కువగా మహిళలు యువకులతో సభ్యత్వాలు కట్టించాలని , కూటమీ ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ కార్యక్రమాలను వివరించవలసిన బాధ్యత జనసైనికులుపై ఉందని అన్నారు. అనంతరం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే పంచకర్లను మండల జనసేన ప్రధాన కార్యదర్శి కుంచా అంజిబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రాజి నారాయణమూర్తి, చింతల శ్రీను, జీలం ప్రదీప్, గురు శివ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉమ్మడి విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షులు జనరాజదాస్ కు ఘన నివాళి

విశాలాంధ్ర-మునగపాక: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు స్వర్గీయ పెంటకోట జనరాజదాస్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి యలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు దొడ్డి శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా దొడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్ఇసిఎస్ చైర్మన్ గా పనిచేసిన జనరాజదాస్ ఆ సంస్థ అభివృద్ధి ఎంతో కృషి చేశారని,ముఖ్యంగా అప్పట్లో ఈ ప్రాంతంలో లోవొల్టేజి సమస్య అధికంగా ఉండడంతో ఆ సమస్యను ప్రభుత్వ పెద్ద దృష్టికి తీసుకువెళ్లి మునగపాకలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేసిన ఘనత,మునగపాకలో బైపాస్ ఏర్పాటు చేసి పలు గ్రామాల ప్రజలకు రాకపోలు సులువుగా చేసిన ఘనత జనరాజదాస్ దక్కుతుందని,అలాగే తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షునిగా పనిచేసి అందరి మన్ననలు పొందారని ఈ సందర్భంగా శ్రీనివాసరావు కొనియాడారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పొలమరశెట్టి నాగు,ఉప సర్పంచ్ గోసాల గోవింద,నీటి సంఘం చైర్మన్ దొడ్డి వీరవెంకటరావు,వార్డు మెంబర్లు రాపేటి శ్రీను,పెంటకోట శివ,గుల్లిపల్లి సత్తిబాబు,మొల్లేటి అదినారాయణ,మోరా రమేష్,కొణతాల రమేష్,పిచ్చిక ఈశ్వరరావు,చదరం వీరునాయుడు,నేతల రాజు,జువ్వాల హరిప్రసాద్,ఆడపా నరేంద్ర,పి.గిరీష్,మళ్ల శివ,రాంబాబు,కొయ్య రమణ పాల్గొన్నారు.